

కొత్తగా 4,531 బియ్యం కార్డులు మంజూరు: జెసి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో కొత్తగా 4,531 మందికి బియ్యం కార్డులు మంజూరు చేసినట్లు జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. జిల్లాలో ఏలూరు మండలంలో 571, నూజివీడు 251, ద్వారకాతిరుమలలో 187, కలిదిండిలో 183, కైకలూరులో 145, లింగపాలెంలో 140, నిడమర్రులో 172, ఉంగుటూరులో 191, చింతలపూడిలో 260, చాట్రాయిలో 118, ఆగిరిపల్లిలో 150, పోలవరంలో 108, జంగారెడ్డిగూడెంలో 292, టి.నరసాపురంలో 148, దెందులూరులో 185, భీమడోలులో 152, కామవరపుకోటలో 145, బుట్టాయగూడెంలో 103, కొయ్యలగూడెంలో 167, మండవల్లిలో 122, పెదపాడులో 174, వేలేరుపాడులో 24, జీలుగుమిల్లిలో 41, కుక్కునూరులో 49, ముదినేపల్లిలో 116, ముసునూరులో 118, పెదవేగిలో 213 మొత్తం 4531 కార్డులు మంజూరయ్యాయన్నారు. ఈ కార్డుదారులకు ఈ నెల నుంచే బియ్యం, ఇతర నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

ఉండేదెవరు.. ఊడేదెవరు..!

సిట్టింగ్ ఎంఎల్ఎల్లో టిక్కెట్ టెన్షన్
రెండు జిల్లాల్లోనూ 12చోట్ల వైసిపి ఎంఎల్ఎలే
ఇప్పటికే పోలవరం, చింతలపూడి ఎంఎల్ఎలకు గుడ్‌బై
మరో నాలుగైదు స్థానాల్లో మార్పు తథ్యమంటూ ప్రచారం
మంత్రుల స్థానాల మార్పుపైనా ఊహాగానాలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అధికార పార్టీ ఎంఎల్ఎల్లో టిక్కెట్ టెన్షన్ వెంటాడుతోంది. నిన్నటి వరకూ ధీమాగా ఉన్నవారు సైతం టిక్కెట్ ఉంటుందో.. ఊడుతుందో అనే ఆందోళనలో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 80కుపైగా స్థానాల్లో మార్పు తథ్యమంటూ వైసిపి అధిష్టానం ఇప్పటికే సంకేతాలు పంపింది. కొన్ని స్థానాల్లో మార్పులు సైతం చేసింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలుండగా వీటిలో 12 చోట్ల వైసిపి ఎంఎల్ఎలు ఉన్నారు. ఉన్న సిట్టింగ్ స్థానాల్లో సగం చోట్ల మార్పు తథ్యమనే చర్చ నడుస్తోంది. ప్రజల్లో వ్యతిరేకత ఉన్నవారిని తప్పించి కొత్తవారిని బరిలోకి దింపేందుకు వైసిపి అధిష్టానం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఏలూరు జిల్లాలో ఏడు స్థానాలకుగాను ఇప్పటికే చింతలపూడి, పోలవరం స్థానాల్లో మార్పులపై అధిష్టానం స్పష్టత ఇచ్చింది. చింతలపూడి సిట్టింగ్ ఎంఎల్ఎ ఎలిజాకు టిక్కెట్ లేదని స్పష్టత ఇవ్వగా, పోలవరంలో సిట్టింగ్ ఎంఎల్ఎ తెల్లం బాలరాజును తప్పించి ఆయన భార్యకు టిక్కెట్ ఇవ్వాలని నిర్ణయించారు. బాలరాజును తప్పించి ఆయన భార్యకు టిక్కెట్ ఇవ్వడంపైనా తీవ్ర చర్చ నడుస్తోంది. భార్యకు టిక్కెట్ ఇస్తే వ్యతిరేకత ఎలా పోతుందనే చర్చ జనాల్లో తీవ్రంగా కొనసాగుతోంది. ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు స్థానంలో కొత్తవారిని బరిలో దించాలని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే సరైన అభ్యర్థి దొరక్కపోతే వాసుబాబునే కొనసాగించాలనే లెక్కలు సైతం అధిష్టానం వేస్తున్నట్లు చెబుతున్నారు. ఏలూరు నుంచి సిట్టింగ్ ఎంఎల్ఎ, మాజీ మంత్రి ఆళ్ల నానికే అవకాశం ఉంటుందని చెబుతున్నప్పటికీ, మార్పుపై ఆలోచన చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

ఇక పశ్చిమగోదావరి జిల్లాలో మూడు స్థానాల్లో మార్పులు తప్పవనే ప్రచారం సాగుతోంది. మార్పులు చేసే స్థానాల్లో ఆచంట, నరసాపురం, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎల పేర్లు ఎక్కువగా విన్పిస్తున్నాయి. ఆచంట ఎంఎల్ఎ, మాజీ మంత్రి చెరుకువాడ రంగనాథరాజును ఆచంట నుంచి తప్పించి పాలకొల్లు టిక్కెట్ ఇవ్వాలని ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. అయితే ఇస్తే ఆచంట ఇవ్వాలని, లేకపోతే లేదని రంగనాథరాజు ఖరాఖండీగా చెప్పినట్లు సమాచారం. దీంతో రంగనాథరాజును మారిస్తే అక్కడ ఎవరిని నిలబెట్టాలనే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు చెబుతున్నారు. నరసాపురం ఎంఎల్ఎ ముదునూరి ప్రసాద్‌రాజు మార్చాలని ఆలోచనలు సైతం జరుగుతున్నట్లు సమాచారం. నరసాపురంలో నిలబెట్టేందుకు బలమైన అభ్యర్థి కోసం అధిష్టానం కుస్తీ పడుతున్నట్లు తెలుస్తోంది. మంత్రి కొట్టు సత్యనారాయణను మార్చి ఉంగుటూరులో నిలబెట్టాలనే ఆలోచన సైతం వైసిపి అధిష్టానం చేస్తున్నట్లు తెలుస్తోంది. రెండు జిల్లాల్లోనూ సగం స్థానాల్లో మార్పులు చేయాలనే ఆలోచనలో వైసిపి ఉన్నప్పటికీ బలమైన అభ్యర్థులు దొరక్క వెనక్కి ముందుక్కి ఊగిసలాడుతున్నట్లు తెలుస్తోంది. మార్పులు చేద్దామన్న పలు స్థానాల్లో కొత్త అభ్యర్థులు దొరకడం లేదనే చర్చ నడుస్తోంది. ఇప్పటికే ఎంపీ స్థానాలకు అభ్యర్థులు దొరక్క వైసిపి అధిష్టానం మల్లగుల్లాలు పడుతుందని, ఇప్పుడు ఎంఎల్ఎ స్థానాల్లోనూ అటువంటి పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు. అధిష్టానం ఇస్తున్న లీకులు, సమాచారంతో సిట్టింగ్ ఎంఎల్ఎల్లో గుబులు నెలకొంది. టిక్కెట్ ఉంటుందా.. ఊడుతుందో తెలియడం లేదంటూ కార్యకర్తల వద్ద తమ అక్కసు వెళ్లగక్కుతున్నట్లు తెలుస్తోంది. దీంతో అధికార పార్టీ వైసిపి ఎంఎల్ఎల తుది జాబితాలో సిట్టింగ్ ఎంఎల్ఎలకు ఎవరికి అవకాశం ఉంటుందో.. ఎవరికి గుడ్‌బై చెబుతారో వేచిచూడాలి.



చెత్త వాహనాలను అడ్డుకుంటున్న మహిళా కార్మికులు

మున్సిపల్ కార్మికులపై విరుచుకుపడ్డ పోలీసులు

బలవంతంగా అరెస్టు: చెత్త వాహనాల తరలింపు
అడ్డుకున్న కార్మికులపై మరోసారి కర్కశత్వం
ప్రభుత్వం, కమిషనర్ తీరుకు నిరసనగా నేడు కార్పొరేషన్ ముట్టడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమ్మెలో ఉన్న మున్సిపల్ కార్మికులపై మున్సిపల్ అధికారులు వెంటరాగా పోలీసులు శుక్రవారం మధ్యాహ్నం విరుచుకుపడ్డారు. ముఖ్యనేతలను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించి మహిళా కార్మికులను మార్గమధ్యంలో విడిచిపెట్టారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. 11 రోజులుగా తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యాన సమ్మె చేస్తున్నారు. శుక్రవారం కూడా అలాగే నగరంలోని పంపుల చెరువు వద్ద ఉన్న వెహికల్ డిపో వద్ద సమ్మె సాగిస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో వంటావార్పు నిర్వహిస్తుండగా ఇద్దరు సిఐల పర్యవేక్షణలో సుమారు 20 మందికిపైగా పోలీసులు ఒక్కసారిగా సమ్మె శిబిరంపై విరుచుకుపడ్డారు. శిబిరంలోని వారిని అరెస్టు చేసి వెహికల్ డిపో గేట్లు తెరిచి వాహనాలు బయటికి పంపుతుండగా వంటల వద్ద ఉన్న కార్మికులు ఆ వాహనాలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. వారిని పోలీసులు ఈడ్చుకెళ్లి పోలీసు వాహనాల్లో పడేశారు. యూనియన్ నాయకులతోపాటు దొరికిన వారిని దొరికినట్లు ఆడ, మగ అనే తేడా లేకుండా ఈడ్చుకెళ్లి వాహనంలో పడేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ముఖ్య నాయకులను వన్‌టౌన్ పోలీస్ స్టేషనుకు తరలించగా మిగిలినవారిని, మహిళలను ప్రయివేటు వాహనాల్లో జ్యూట్‌మిల్లు వంతెన వరకు తరలించి అక్కడ విడిచిపెట్టారు. దీంతో వారు ఎండలో నడుచుకుంటూ తిరిగి సమ్మె శిబిరం వద్దకు చేరుకున్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు, ఏలూరు నగర అధ్యక్షులు లావేటి కృష్ణారావు, వారికి మద్దతుగా వచ్చిన ఆటో డ్రైవర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి తదితరులు 20 మందిని అరెస్ట్ చేసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌లో వారిని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, నేత పివి.రామకృష్ణ పరామర్శించారు. ఈ మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడగటం అన్యాయమా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం దౌర్జన్యాలు, బెదిరింపులు, అక్రమ అరెస్టులు మాని కార్మికులకు ఇచ్చిన హామీల అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ తీరును నిరసిస్తూ శనివారం నగర పాలక సంస్థ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ప్రకటించారు.

చింతలపూడి: మున్సిపల్ కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య అన్నారు. పట్టణంలో నగర పంచాయతీ వద్ద మున్సిపల్ కార్మికుల చేపట్టిన సమ్మె 11వ రోజుకు చేరింది. సమ్మె శిబిరానికి జి.నాగరాజు, వి.పద్మ నాయకత్వం వహించారు.



నేత జె.గోపీని లాక్కెళ్తున్న పోలీసులు

సమ్మె శిబిరాన్ని టిడిపి పట్టణాధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం సందర్శించి టిడిపి, జనసేన తరఫున పూర్తి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఐటిడిపి నియోజకవర్గ కన్వీనర్ బోడా అవినాష్, నేతలు మారూమూడి థామస్, కర్లపూడి రాజారత్నం, జనసేన మహిళా కార్యదర్శి గుమ్మిశెట్టి భారతి, నేతలు గంగాధర్, టోకూరి ఏసు పాల్గొన్నారు. ఎఐటియుసి ఆధ్వర్యాన పట్టణంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు.

నూజివీడు: మున్సిపల్ కార్మికుల సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఎఐటియుసి రాష్ట్ర నాయకులు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు, ఎఐటియుసి కార్యదర్శి సిహెచ్.పుల్లారావు, నాయకులు జయలక్ష్మి, గోవింద్, రాణి, ఉషారాణి, పద్మ, జయరాం, గంగాధర్, రవి, విజయ్ పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్: ఎఐటియుసి ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికుల సమ్మె శుక్రవారం మూడోరోజు కొనసాగింది. సమ్మెకు జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు నేతృత్వం వహింఆచరు. సమ్మె శిబిరాన్ని ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వామనామూర్తి, ఏలూరు నగర అధ్యక్షులు పుప్పాల కన్నబాబు సందర్శించి మాట్లాడారు. నేతలు మన్నవ యామిని,అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా మద్దతు తెలిపారు.

కొల్లేరుపై చేతులెత్తేసిన ఎంఎల్ఎలు..!

కొల్లేరు సున్నిత పర్యావరణ ప్రాంత నిర్ధారణ సమావేశం
కొల్లేరు ప్రాంత ఎంఎల్ఎలు, ఎంఎల్‌సి హాజరు
ఎకోసెన్సిటివ్ జోన్ తప్పదన్నట్లు అధికారుల వ్యాఖ్యలు
పది గ్రామాలు తగ్గించి, ఐదో కాంటూరుపైన కిలోమీటర్ వరకూ సెన్సిటివ్ జోన్ ఏర్పాటు చేయాలన్న ప్రజాప్రతినిధులు
మూడో కాంటూరుకు కుదింపు, ఎకోసెన్సిటివ్ జోన్‌ను వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టంగా చెప్పని నేతలు



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరు ఎకోసెన్సిటివ్ జోన్‌పై సదరు కమిటీ అధ్యక్షులు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అధ్యక్షతన కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఎంఎల్ఎలు పూర్తిగా ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా వ్యవహరించిన పరిస్థితి కన్పించింది. కొల్లేరు మూడో కాంటూరుకు కుదింపు, ప్రజలు వ్యతిరేకిస్తున్న ఎకో సెన్సిటివ్ జోన్‌పై స్పష్టమైన అభిప్రాయాలు చెప్పకుండా అధికారుల మాటలకు వంతపాడినట్లు తెలుస్తోంది. ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలోని పది గ్రామాలను తప్పించాలని కొంతమంది ప్రజాప్రతినిధులు, ఐదోకాంటూరుపైన ఒక కిలోమీటర్ మేర ఎకోసెన్సిటివ్ జోన్ ఏర్పాటు చేయాలంటూ మరికొంతమంది మాట్లాడిన పరిస్థితి ఉంది. మండల కేంద్రాల్లో నిర్వహించిన సమావేశాల్లో కొల్లేరు ఎకోసెన్సిటివ్ జోన్‌ను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించినా ప్రజాప్రతినిధులు అందుకు విరుద్ధంగా మాట్లాడటం ఏమిటో ఏఒక్కరికీ అర్థం కాని పరిస్థితి నెలకొంది. సమావేశంలో జరిగిన చర్చలు ఒకసారి పరిశీలిస్తే అసలు విషయం అర్థమవుతోంది. కొల్లేరు సున్నిత పర్యావరణ ప్రాంతం పరిధిలోకి వచ్చే తొమ్మిది మండలాల్లోని 89 గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయాలు, సంబంధిత నియోజకవర్గాల ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు, వివిధ ప్రభుత్వ శాఖల అభిప్రాయాలు, సూచనలపై చర్చ జరిగింది. సమావేశంలో డివిజనల్ అటవీ శాఖాధికారి, వన్యప్రాణి యాజమాన్య విభాగం అధికారులు ఇప్పటి వరకు తీసుకున్న చర్యలను వివరించారు. కమిటీ అధ్యక్షులు, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మోనిటరింగ్ కమిటీ సభ్యులకు, హాజరైన ప్రజాప్రతినిధులకు సవివరంగా సున్నిత పర్యావరణ ప్రాంత మౌళిక విషయాలను, పరిధి ప్రతిపాదనలను తెలిపారు. దీనిపై కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు తన అభిప్రాయాన్ని వివరించారు. ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ చివరిగా కొల్లేరు ఐదో కాంటూరు నుండి ఒక కిలోమీటరు పరిధిని ప్రతిపాదించారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ ఒక కిలో మీటరుపరిధి ప్రతిపాదనలు ఎంతవరకు సఫలీకృతమవుతాయని అనుమానం వ్యక్తం చేశారు. పదో కాంటూరు వరకు జాతీయ ప్రాముఖ్యత కలిగిన రాంసార్ ప్రాంతంగా 2002లో కేంద్రప్రభుత్వం ప్రకటించి కొల్లేరు పరిధిని పదో కాంటూరును ప్రామాణికంగా తీసుకుని నిర్ణయించిందని తెలిపారు. చిత్తడి నేలల నిబంధనలు 2017 వర్తిస్తాయి కనుక పర్యావరణాన్ని, పక్షులను, సమాజాన్ని దృష్టిలో ఉంచుకుని 89 గ్రామాల పరిధిని చివరిగా ప్రతిపాదన చేశామని కలెక్టర్ తెలిపారు. దెందులూరు, ఉంగుటూరు, కైకలూరు ఎంఎల్ఎలు, ఎంఎల్‌సి మొదటగా పది గ్రామాలను సున్నిత పర్యావరణ ప్రాంతం పరిధి నుండి తొలగించాలని ప్రతిపాదించినారు. కాలుష్య నియంత్రణ మండలి, కార్యనిర్వాహక ఇంజినీరు పరిశ్రమల ఆవశ్యకతపై తమ అభిప్రాయాలను తెలిపారు. గ్రామదీప్ ట్రస్టు సభ్యులు, పర్యావరణవేత్త తన అభిప్రాయాలను తెలిపారు. జిల్లా అటవీశాఖాధికారి సున్నిత పర్యావరణ ప్రాంతంపై సుప్రీంకోర్టు ఉత్తర్వులను వివరించారు. సభ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సున్నిత పర్యావరణ ప్రాంతం నియమావళికి అనుగుణంగా ప్రజాప్రతినిధులతో మరోసారి చర్చించి తుది రూపానికి తీసుకొచ్చి తదుపరి సమావేశంలో పెట్టాలని మెంబర్ కన్వీనర్‌కు కలెక్టర్ సూచించారు. సమావేశంలో కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, కమిటీ మెంబర్ కన్వీనర్, డివిజనల్ అటవీ శాఖాధికారి, వన్యప్రాణి యాజమాన్య విభాగ అధికారి ఎస్.రవిశంకర్, జిల్లా అటవీ శాఖాధికారి రవీంద్ర ధామా, ఇతర కమిటీ సభ్యులు తమ అభిప్రాయాలు తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్‌పి మేరీప్రశాంతి

మానసికోల్లాసానికి పోలీసులకు ఆటల పోటీలు

ప్రారంభించిన జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నిత్యం ఉద్యోగ బాధ్యతలు నిర్వహించే పోలీసు సిబ్బందికి మానసికోల్లాసం కోసం ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి తెలిపారు. స్థానిక జిల్లా పోలీస్ మైదానంలో శుక్రవారం జిల్లా పోలీసు స్పోర్ట్స్‌మీట్‌ను ఆమె ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆటల పోటీలను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసులు నిత్యం కేసులకు సంబంధించిన విచారణ, శాంతిభద్రతలను కాపాడటంలో నిమగ్నమై ఉంటారన్నారు. వారు ఒత్తిడిని అధిగమించేలా మానసికోల్లాసం కోసం పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కబడ్డీ, వాలీబాల్, పరుగుపందెం, హాకీ, ఫుట్‌బాల్, లాంగ్‌జంప్, టెన్నిస్, హైజంప్, క్రికెట్ వంటి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం సాయంత్రం వరకూ పోటీలు సాగుతాయని, అనంతరం విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి ఎంజెవి.భాస్కర్‌రావు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి సూర్యచంద్రరావు, ఎఆర్ అదనపు ఎస్‌పి శేఖర్, ఏలూరు డిఎస్‌పి శ్రీనివాసులు, డిసిఆర్‌బి డిఎస్‌పి చంద్రశేఖర్, ఎస్‌బి సిఐ ఆదిప్రసాద్, ఆర్‌ఐ పవన్‌కుమార్, మహిళా ఎస్‌ఐలు క్రాంతిప్రియ, నీహారిక తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల నేతలకు పోలీసుల నోటీసులు

భీమడోలు: ఏలూరులో శనివారం అంగన్వాడీలు నిర్వహించే 24 గంటల రిలే నిరాహార దీక్ష కార్యక్రమానికి హాజరు కావొద్దంటూ సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజుకు పోలీసులు నోటీసు జారీ చేశారు. శుక్రవారం ఉదయం లింగరాజు నివాసానికి చేరుకున్న నోటీసులు అందజేశారు.

నిడమర్రు: మధ్యాహ్న భోజనం, విఆర్‌ఎల ఆందోళనకు విజయవాడ, ఏలూరు వెళ్లొద్దంటూ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావుకు గురువారం రాత్రి పోలీసులు నోటీసులు ఇచ్చారు.

9న జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సు



కరపత్రం ఆవిష్కరించిన నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 9న జరిగే జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక పవర్‌పేటలోని ఉద్దరాజు రామం భవనంలో శుక్రవారం జిల్లా సమ గ్రాభివృద్ధి సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ 9వ తేదీ ఉదయం 11 గంటలకు ఆర్‌ఆర్‌పేటలోని శ్రీ కాశీవిశ్వేశ్వర కళ్యాణ మండపంలో ఏలూరు జిల్లా సమ గ్రాభివృద్ధి పేరుతో నిర్వహించే సదస్సులో పెద్దఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లాలోని వనరులు, అవకాశాలు, వ్యవసాయం, పారిశ్రామిక, సేవారంగాల్లో అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక విడుదల చేస్తామని చెప్పారు. సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఎంఎల్‌సిలు కె.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, నాయకులు, జిల్లా ప్రము ఖులు, మేధావులు పాల్గొని అభిప్రాయలు, సలహాలు అందజేస్తారన్నారు. కరపత్ర ఆవిష్కరణలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్, జిల్లా కమిటీ సభ్యులు పి.రామకృష్ణ, చేతివృత్తి దారుల జిల్లా సమన్వయకర్త పి.ఆదిశేషు, సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మాతృభాష విద్యావాలంటీర్ల దీక్షలు



మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ మొడియం శ్రీనివాసరావు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మాతృభాష విద్యా వాలంటీర్లు కెఆర్‌పురంలోని ఐటిడిఎ వద్ద శుక్రవారం రిలేదీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు మాజీ ఎంఎల్ఎ మొడియం శ్రీనివాసరావు, సిపిఐ (ఎంఎల్) నేత జొన్నకూటి వెంకటేశ్వరరావు, ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు పోలోజు నాగేశ్వరరావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఎ శ్రీనివాస్ మాట్లాడుతూ మాతృభాష ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. మూడు నెలల వేతన బకాయిలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించి శిక్షణ ఇవ్వాలని కోరారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ ఐటిడిఎ అధికారులు మాతృభాషా వాలంటీర్ల సమస్యలు పరిష్కరించకపోగా బెదిరింపులకు గురి చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. చేసిన పనికి వేతనం చెల్లించాలని కోరితే చర్యలు తీసుకుంటామనడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే సమస్యలకు పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎం.కుసుమకుమారి, కె.గీతాజలి, పి.బేబీ, కె.సీతామహాలక్ష్మి. కె.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

డిపాజిట్‌దారులందరికీ న్యాయం చేస్తాం


డిప్యూటీ రిజిస్ట్రార్ ఎం.రవికుమార్

ప్రజాశక్తి - టి.నరసాపురం

టి.నరసాపురం సొసైటీలో డిపాజిట్‌దారులందరికీ రెండు, మూడు నెలల్లో న్యాయం చేస్తామని కోఆపరేటివ్ డిప్యూటీ రిజిస్ట్రార్ ఎం.రవికుమార్ తెలిపారు. స్థానిక సొసైటీ వద్ద శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాతూ డిపాజిట్‌దారులు ఎటువంటి ఆందోళనా చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటికే బాధ్యులకు చెందిన ఆస్తులను జప్తు చేశామని, డిక్రీ పొందిన అనంతరం వాటిని వేలం ద్వారా విక్రయించిన నగదుతోపాటు రైతులు రుణాలు పొంది కాలం గడిచినా చెల్లించని నగదు వసూలు చేసి డిపాజిట్‌దారులకు చెల్లిస్తామన్నారు పిఎసిఎస్ సిబ్బందిని రైతుల నుంచి రుణాల వసూళ్లకు నియమించామని ఆయన తెలిపారు.

అర్హతే ప్రామాణికం

లబ్ధి అందని 2,168 మందికి రూ.3.38 కోట్లు విడుదల: కలెక్టర్



నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర, ఎంఎల్‌సి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో (2023 ఆగస్టు నుంచి డిసెంబర్ వరకూ) బైయాన్యువల్ పథకం (ద్వైవార్షిక పథకం) ద్వారా 2,168 మంది లబ్ధిదారులకు రూ.3.38 కోట్లు ప్రభుత్వం విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్నవెంకటేష్ చెప్పారు. గత సంవత్సరం ఆగస్టు నుండి డిసెంబర్ వరకూ అమలైన వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ఏ కారణం చేతనైనా లబ్ధి అందని 68,990 అర్హులకు రూ.97.76 కోట్లను శుక్రవారం సిఎం క్యాంపు కార్యాలయంలో జగన్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. వర్చువల్ విధానంలో ఏలూరు కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. దీనికి సంబంధించి మొత్తం 2168 మంది లబ్ధిదారులకు రూ.3 కోట్ల 37 లక్షల 90 వేల విలువైన చెక్కును కలెక్టర్ పసన్న వెంకటేష్, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పథకం లబ్ధి అందించిన తర్వాత కూడా పొరపాటున ఏ కారణం చేతనైనా అందని వారికి మరో అవకాశం ఇస్తున్నారన్నారు. జిల్లాలో బిసి కార్పొరేషన్ పరిధిలో వైఎస్ఆర్ ఇబిసి నేస్తం కింద 143 మందికి రూ.21.45 లక్షలు, వైఎస్ఆర్ కాపునేస్తం కింద 102 మందికి రూ.15.30 లక్షలు, జగనన్న చేదోడు కింద 486 మందికి రూ.48.60 లక్షలు, రవాణా శాఖ ద్వారా వైఎస్ఆర్ వాహనమిత్ర పథకం కింద 77 మందికి రూ.7.70 లక్షలు, మత్స్యశాఖ పరిధిలో మత్స్యకార భరోసా పథకం కింద ఒక్కరికి రూ.10 వేలు, విద్యాశాఖ ద్వారా జగనన్న అమ్మ ఒడి పథకం కింద 1276 మందికి రూ.1.79 కోట్లు, సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా వైఎస్ఆర్ కల్యాణ మస్తు, షాదీ తోఫా పథకం కింద 83 జంటలకు రూ.65.55 లక్షలు నగదును నేరుగా ఖాతాల్లో జమ చేశారు.

బెదిరింపులకు అదరబోము.. బెదరబోము

విధుల్లో చేరాలని నోటీసులు ఇచ్చినా.. చేరని వారిని తొలగిస్తామని భయపెట్టినా అదరము.. బెదరము అంటూ అంగన్వాడీలు తమ సమ్మెను 25వ రోజు కొనసాగించారు. పలుచోట్ల అంగన్వాడీలు 25 ఆకారంలో ఒదిగి నిరసన తెలిపారు.

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తోందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఐదో తేదీలోపు విధుల్లో చేరని వారిని తొలగిస్తామని బెదిరింపు ప్రకటనలు చేయడం మాని సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీలు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరవధిక సమ్మె 25వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు వినూత్నంగా 25 ఆకారంలో కూర్చుని నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.విజయలక్ష్మి, పి.హైమావతి, ఏలూరు ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు రజిని, భవాని, పెదపాడు ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతమ్మ, బేబీరాణి పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : మండలకేంద్రంలో అంగన్వాడీ నిరసనలు 25వ రోజుకు చేరుకున్నాయి. ఈ క్రమంలో ఎంపిడిఓ తెల్లం బాలరాజు ఎంపిడిఓ ఆఫీస్ దగ్గర నూతన పింఛన్లు పంపిణీ చేసి అంగన్వాడీల సమ్మె శిబిరం వైపు వెళ్తుండగా ఒక్కసారిగా అంగన్వాడీలు అడ్డగించారు. దీంతో తప్పని పరిస్థితిలో ఎంఎల్ఎ శిబిరం వద్దకు వచ్చి అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. మీ డిమాండ్లు న్యాయమైనవని, నా వంతుగా సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే దిశగా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ 25 రోజుల తరువాత అంగన్వాడీలు గుర్తుకు వచ్చారా, వారి సమస్యలు గాలికి వదిలేసి రాజకీయ లబ్ధి కోసమా ఈ గ్రామాలు అని విమర్శించారు. మీకు చిత్త శుద్ధి వుంటే ఈరోజే సమస్యలు పరిష్కరించుకుపోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అంగన్వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.భారతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షులు శిరపల్లి కుమారి, పి.పద్మజ, జె.నాగేని, అడపా నాగజ్యోతి, సిహెచ్.సునీతరావల్, బొల్లిలి చిట్టి, కె.జ్యోతి, కె.మాధవి పాల్గొన్నారు.

నిడమర్రు : కార్మికుల హక్కులను కాలరాస్తూ రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు, కార్మికుల్ని బెదిరించి, భయపెట్టి పనిచేయించుకోవాలనుకోవడం కార్మిక వ్యతిరేక విధానమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు అన్నారు. నిడమర్రులో శుక్రవారం 25 రోజుల సమ్మె సందర్భంగా 25 నమూనాలో అంగన్వాడీలు ఒదిగి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోన శ్రీనివాసరావు, ఆర్.రామలక్ష్మి, ఎ.నాగమణి, బి.సత్యవేణి, టి.త్రివేణి, కెవి.సత్యవతి, ఎన్.పార్వతి, నిర్మల కుమారి నాయకత్వం వహించారు.



ఏలూరు అర్బన్ : 25 అంకె ఆకారంలో ఒదిగి నిరసన

జీలుగుమిల్లి : అంగన్వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారానికి చేపట్టిన నిరవధిక సమ్మె నిరంతరాయంగా కొనసాగుతూ శుక్రవారానికి 25వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కళ్లు, చెవులు, నోరు మూసుకొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి కొండలరావు, అంగన్వాడీ కార్యకర్తలు నాగమణి, ఎస్తేరు, సరళ, జ్యోతి పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: పట్టణంలోని కలెక్టరేట్ వద్ద అంగన్వాడీల నిరసన దీక్ష 25వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు కార్యదర్శి ఆదిలక్ష్మి మాట్లాడుతూ 25 రోజులుగా నిరసనలు తెలియపరుస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా లేదని విమర్శించారు. ప్రభుత్వం దిగి వచ్చేవరకు నిరసన ప్రదర్శన చేస్తూనే ఉంటామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రమాదేవి, ఆదిలక్ష్మి, లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

చింతలపూడి : అంగన్వాడీ సమ్మె 25వ రోజుకు చేరింది. ప్రభుత్వం కలెక్టర్ ద్వారా బెదిరింపు చర్యలకు పాల్పడినా లెక్కచేయకుండా అంగన్వాడీలు పెద్ద ఎత్తున నిరసన శిబిరంలో పాల్గొన్నారు. ప్రభుత్వ బెదిరింపు చర్యలకు భయపడమని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు నాయకులు ఎన్.సరోజిని, టి.మాణిక్యం, ఆదిలక్ష్మి, ధనలక్ష్మి, ప్రమీల పాల్గొన్నారు.

చాట్రాయి: అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేస్తున్న నిరవధిక సమ్మె 25వ రోజున చాట్రాయి మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద కొనసాగింది. శుక్రవారం అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు హరిదాసు సంక్రాతికి దానాలు స్వీకరించడం ఆనవాయితీగా వారు వినతిని పాత్రలో వేశారు. ఈ కార్యక్రమానికి విజయ, ప్రమీలరాణి, పద్మ, సుధా నాయకత్వం వహించారు.

కుక్కునూరు : అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే సమ్మె విరమించేదే లేదని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ అన్నారు. అంగన్వాడీ సమ్మె శుక్రవారం 25వ రోజు చేరింది. ఈ సందర్భంగా ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోవడంతో దున్నపోతుకు వినతిని ఇచ్చి నిరసన తెలిపారు. ఈ సమ్మెకు అల్లూరి సీతారామరాజు ఆటో డ్రైవర్ల యూనియన్ నుంచి మద్దతు తెలిపి సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మెలో అంగన్వాడీ యూనియన్ నాయకులు బాడిస సుజాత, సిఐటియు మండల సహాయ కార్యదర్శి పోచారపు వెంకటేశ్వర్లు, ఆటో డ్రైవర్లు హరీష్, వెంకన్న, సాయి పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : రాష్ట్రంలో మండలంలో అంగన్వాడీల సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరుకుంది. ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కెవి రమణ, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్‌లు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ డివిజన్ సహాయ కార్యదర్శి టి.బాబురావు, టి.రామలక్ష్మి పాల్గొన్నారు.

ముసునూరు : మండల కేంద్రమైన ముసునూరు గ్రామ సచివాలయంలో 25వ రోజు సమ్మె శిబిరంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నూజివీడు ప్రాజెక్టు కార్యదర్శి పల్లి పాము రాజకుమారి, కలపాల విద్యావతి, శిరీష, మేరీ సులోచన పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 25వ రోజుకు చేరింది. జగన్ ప్రభుత్వంపై పాటలు పాడుతూ నిరసన తెలిపారు. అంగన్వాడీల సంఘం నాయకులు షేక్ అబిదా బేగం, జక్కంశెట్టి మేనక లక్ష్మి, కొప్పినీడి రమాదేవి పాల్గొన్నారు.

ముదినేపల్లి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారంతో 25వ రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో పద్మ, అరుణ పాల్గొన్నారు.

భీమడోలు : మండలంలో అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 25వ రోజుకు చేరిన నేపథ్యంలో అంగన్వాడీలు భీమడోలు దీక్షా శిబిరం వద్ద 25 అంకె రూపంలో మానవహారంగా ఏర్పడి తమ నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లింగరాజు ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ నాయకులు స్వర్ణ కుమారి, చెల్లామణి, రాజామణి నాయకత్వం వహించారు.



నిడమర్రులో..

రేపటి నుంచి రిలే నిరాహార దీక్షలు

ఏలూరు అర్బన్ : అంగన్వాడీల సమ్మెలో భాగంగా శనివారం నుంచి 24 గంటల రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.భారతి ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏలూరు కలెక్టరేట్ వద్ద దీక్షలను సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎఆర్.సింధు ప్రారంభిస్తారని తెలియజేశారు.

అర్ధరాత్రి ఆయాలకు నోటీసులు

పోలవరం: మండలంలో గురువారం అర్ధరాత్రి 11 గంటల సమయంలో పోలీసులు అంగన్వాడీ ఆయమ్మల ఇళ్ల వద్దకు వెళ్లి విజయవాడలో జరగబోయే ధర్నాకు వెళ్లవద్దని నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వానికి అంగన్వాడీలకు, మిడ్డే మీల్స్‌కి తేడా తెలియకపోవటం మా ఖర్మగా భావిస్తున్నామని వారు ఎద్దేవా చేశారు. 25వ రోజు సమ్మెలో భాగంగా అర్ధరాత్రి వేళ నోటీసులు ఇవ్వడాన్ని మండల సిఐటియు కార్యదర్శి పిఎల్ఎస్.కుమారి ఖండించారు. ఈ కార్యక్రమంలో పద్మావతి, వేణి, సత్యవేణి పాల్గొన్నారు.

ఆసీలపన్ను దందాను నిర్మూలించాలి : సిపిఎం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణంలో అక్రమంగా జరుగుతున్న ఆసీలపన్ను దందాను నిర్మూలించాలని సిపిఎం నాయకులు మున్సిపల్ కమీషనర్‌ను డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం ఆఫీసులో పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల కమిటీ సభ్యులు ఎ.ప్రభాకర్ రావు అధ్యక్షత వహించగా పట్టణంలోని రోడ్లు, డ్రెయినేజీ, వీధిలైట్లు, పందుల సమస్య, ఆశీల పన్ను దందాలపై చర్చించారు. అనంతరం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లాడుతూ పట్టణంలో చిన్న చితక చిరు వ్యాపారాలు చేసుకుంటున్న తోపుడు బళ్లు, సైకిళ్లపై తినుబండారాలు, వస్తువులు అమ్ముకొని పేదలు జీవిస్తున్నారని వారి నుంచి 50 నుంచి వంద రూపాయల వరకు ఆసీల పన్ను మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్ వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే కాకుండా పట్టణంలోని వ్యాపారస్తులు ఇతర పట్టణాల నుంచి లారీలతో సరుకులు దిగుమతి చేసుకోవటానికి తెచ్చిన సరుకుల లారీకి రూ.100 నుంచి 400 వరకు ఆశీలపన్ను విధించటం దుర్మార్గమన్నారు. తక్షణమే ఆశీల పన్ను కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని ఆయన కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌కి ఈ సమస్య పరిష్కారం కోసం దరఖాస్తులు పెట్టినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోగా బాధితులు ఎవరికైనా చెబితే మీ అంతు చూస్తామని కాంట్రాక్టర్, మున్సిపల్ అధికారులు బెదిరిస్తున్నారని బాధితులు వాపోతున్నారని ఆయన తెలిపారు. కాంట్రాక్టర్లపై, వారికి సహకరిస్తున్న మున్సిపల్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గవర్నమెంట్ నిబంధనల ప్రకారం ఆశీలపన్ను కట్టించుకోవాలని లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో సంబంధిత బాధితులను, వ్యాపారస్తులను ఐక్యంచేసి మున్సిపల్ కార్యాలయం వద్ద సమస్యలు పరిష్కారానికై మున్సిపల్ ఆఫీస్‌ని ముట్టడిస్తామని అధికారులను హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ మండల కమిటీ సభ్యులు జి.సూర్య కిరణ్, జోడే సూర్యచంద్రరావు, యాగంటి సీత, గరికి రాంబాబు, పిల్లి చంటి పాల్గొని మాట్లాడారు.

'నవరత్నాలు అమలు కావాలంటే జగన్‌ను గెలిపించుకోవాలి'

ప్రజాశక్తి - చాట్రాయి

ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెన్షన్ రూ.3 వేలకు పెంచడం జరిగిందని, వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోకపోతే నవరత్నాలు అమలు జరగవని నూజివీడు ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. శుక్రవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పింఛన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఎల్ఎ పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.మురళీమోహన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశి రెడ్డి రాఘవరెడ్డి, ఎంపిపి లంక నిర్మల పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించడమే 'జగనన్న సురక్ష' లక్ష్యం

ఎంపిపి కొర్స పోసమ్మ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే జగనన్న సురక్ష లక్ష్యం అని ఎంపిపి కొర్స పోసమ్మ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ములగలంపల్లి పంచాయతీలో ఏర్పాటు చేసిన రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం సురక్ష శిబిరాలను ఏర్పాటు చేసిందని, ప్రతి ఒక్కరు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి మల్లం వసంతరావు, వైస్.ఎంపిపి ఎస్.శ్రీనివాస్, సర్పంచి రాజు, మండల అధ్యక్షులు సందా ప్రసాద్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : దేశంలోని తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రజల ఇంటి వద్దనే వైద్య సేవలు అందిస్తూ మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య అన్నారు. మండలంలోని పెదపాలపర్రులో జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం శుక్రవారం జరిగింది. వివిధ వ్యాధులకు సంబంధించి 200 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సొసైటీ అధ్యక్షులు సిహెచ్.ప్రసాద్, మాజీ సర్పంచి శ్రీకాంత్, వైసిపి నాయకులు గంట కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలులో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ విగ్రహాన్ని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ సహాయ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్ శుక్రవారం రాత్రి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగ సమావేశంలో మంత్రి మాట్లాడారు. దీన్ దయాల్ శర్మ చేసిన సేవా కార్యక్రమాలపై వివరించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి మాట్లాడుతూ కరోనా సమయంలో రాజకీయ పార్టీలు ఐసిలో ఉంటే బిజెపి ఒక్కటే అనేక సేవా కార్యక్రమాలు చేసిందన్నారు. బిజెపి నాయకులు శరణాల మాలతీ రాణి, పాకా సత్యనారాయణ, విగ్రహ శిల్పి దేవికా ఉదయార్ పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై సమీక్షలో తహశీల్దార్

ప్రజాశక్తి - భీమడోలు

యువత కోడి పందేలు, పేకాట వంటి చెడు వ్యసనాలకు దూరంగా కుటుంబ సభ్యులతో ఆనందంగా సంక్రాంతి పండగ జరుపుకోవాలని భీమడోలు తహశీల్దార్ ఎం.ఇందిరాగాంధీ కోరారు. రానున్న సంక్రాంతి పురస్కరించుకొని కోడి పందేలు, ఇతర చట్ట విరుద్ధ కార్యక్రమాలను అరికట్టడంపై గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో తహశీల్దార్ శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ కోడిపందేలు, పేకాట వంటి కార్యక్రమాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. సంక్రాంతి పురస్కరించుకొని చట్టరీత్యా నేరంగా పరిగణించే కార్యక్రమాలు అరికట్టేందుకు బాధ్యులైన అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సంక్రాంతి పురస్కరించుకొని గతంలో పోలీసు బైండోవర్ కింద పేర్లు నమోదైన మండల పరిధిలోని సుమారు 1600 మందికి దశలవారీగా కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమడోలు ఎస్ఐ చావా సురేష్, డిప్యూటీ తహశీల్దార్ షంషుద్దీన్ పాల్గొన్నారు.

కొల్లేరు ప్రజల కష్టాలు తీరుస్తాం

గుడివాకలంకలో 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభించిన ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్య చౌదరి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

కొల్లేరు ప్రజల కష్టాలు పూర్తిగా తొలగించేందుకు కృషి చేస్తున్నట్టు దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్య చౌదరి చెప్పారు. ప్రజా ఆశీర్వాద యాత్ర-2లో భాగంగా గుడివాకలంకలో రూ.4 కోట్ల 60 లక్షలతో నిర్మించిన 33/11 కేవి విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ స్టేషన్ గృహావసరాలు పూర్తిగా తీరడమే కాకుండా ఆక్వాకి ఊతం ఇస్తుందన్నారు. ప్రజలు కోరిన వెంటనే సమస్యను సిఎం దృష్టికి తీసుకువెళ్లి, సంబంధిత అధికారులను పలుమార్లు కలిసి, సరైన ప్రణాళికలు రూపొందించి, ప్రత్యేక అనుమతులు సాధించి, దశాబ్దాల తమ కరెంట్ సమస్యను తీర్చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, జెడ్‌పి ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ అప్పన కనకదుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.

హేలాపురిలో ప్రగతి బాటలు

పలు అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ ఆళ్ల నాని శంకుస్థాపన

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నియోజకవర్గ పరిధిలో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతున్నామని ఏలూరు ఎంఎల్ఎ ఆళ్ల నాని పేర్కొన్నారు. శుక్రవారం 26, 35, 44, 45 డివిజన్ల పరిధిలో రూ.1.29 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, మరో రూ.1.62 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలే లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, ఇడా ఛైర్మన్ బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్‌లు ఎన్.సుధీర్ బాబు, గుడిదేసి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు వేగ నియంత్రణ పాటించాలి : సిఐ

ప్రజాశక్తి - చింతలపూడి

వివిధ ప్రాంతాలు, రహదారుల్లో వేగనియంత్రణ చేసుకుంటూ ఆటోలో ఉన్నటువంటి ప్రయాణీకులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలని, చింతలపూడి సిఐ మల్లేశ్వరావు అన్నారు. చింతలపూడి ఆటో యూనియన్ల వారికి ఆటో స్టాండ్‌లో రహదారి ప్రమాదాల నివారణకు, స్కూల్స్, కాలేజీ పిల్లలను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి పలు సూచనలు, సలహాలు ఇచ్చి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను అనుమతించరాదని తెలిపారు. ఆటోలలో విద్యార్థులను తీసుకువెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి పట్టణంలో శ్రీసాయి స్ఫూర్తి హాస్పటల్ యాజమాన్యం వారు ఆటో డ్రైవర్లకు, వారి కుటుంబ సభ్యులకు హెల్త్ కార్డులను అందించారు. 20శాతం రాయితీని ప్రకటించి ఆటో డ్రైవర్లకు యూనిఫామ్‌ను శ్రీసాయి స్ఫూర్తి హాస్పిటల్ వారు అందించారు. అనంతరం రహదారి ప్రమాదాల నివారణకు పట్టణంలో పోలీస్ సిబ్బంది, ఆటో యూనియన్, ప్రజలు భాగస్వామ్యంతో ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

'భూహక్కును కోల్పోయే చట్టాన్ని రద్దు చేయాలి'

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని కోర్టు భవనాల వద్ద ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్-2023 రద్దు కోరుతూ చేపట్టిన ఆందోళన శుక్రవారం 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నూజివీడు బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మదుపల్లి మధు రవిశంకర్ మాట్లాడుతూ యజమానులు భూ హక్కులను కోల్పోయే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్య ప్రకాష్ పాల్గొన్నారు.

చింతలపూడి: చింతలపూడి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మాణిక్యాలరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 27/23 రద్దు చేయాలని కోరుతూ చేస్తున్న దీక్షలు శుక్రవారం కొనసాగాయి. న్యాయవాదులు కోర్టు సిబ్బందిని గౌరవ్ చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్, టిడిపి నాయకులు మద్దతు తెలియజేశారు. రిలే నిరాహార దీక్షల్లో డి.సుందర రావు, మన్నం సత్తిబాబు, దీపక్ ఉప్పయ్య, రంజిత్, అశోక్ పాల్గొన్నారు.

చలి, కరోనాతో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పరిసర ప్రాంతాలలో పెరుగుతున్న చలి, కరోనా కేసుల దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మంచులో బయటకు వెళ్లవద్దని, అత్యవసరమైతే స్వెటర్, మంకీ క్యాప్‌లు ధరించాలన్నారు. కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో తప్పనిసరిగా మాస్కులు ధరించి దూరాన్ని పాటించాలని, వేడి ఆహార పదార్థాలు, వేడి పానీయాలు స్వీకరించాలని ఆయన సూచించారు.

వాలంటీర్ ఔదార్యం

ప్రజాశక్తి - పోలవరం

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతినెలా మొదటి, రెండో తేదీ లోపే పింఛన్లను వారి ఇంటి తలుపు తట్టి పంపిణీ చేస్తున్నారు. ఒకవేళ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుంటే వారి వద్దకు వెళ్లి పెన్షన్లు అందజేస్తున్నారు. మండల పరిధిలోని పాత నూతనగూడెం గ్రామానికి చెందిన మంటసాల శేష సాయి రాజ్ కుమార్‌కు విజయవాడ హాస్పిటల్‌లో షుగర్ వలన ఒక కాలును తొలగించారు. విషయం తెలుసుకున్న పోలవరం సచివాలయం-2 వాలంటీర్ బి.శివ జ్యోతి ఆసుపత్రికి వెళ్లి అతనుకు పింఛను అందజేశారు. ఆసుపత్రికి వచ్చి పింఛన్ అందించినందుకు వాలంటీర్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



విద్యార్థికి సైకిల్ అందజేస్తున్న లింగరాజు

దాత సహాయంతో బాలికలకు సైకిళ్ల పంపిణీ

భీమడోలు : బాలికా విద్యను ప్రోత్సహించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు తెలిపారు. విద్య కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం ఎస్ఆర్ఎ సరికొండ లెనిన్ బాబు సైకిళ్లను అందజేశారు. భీమడోలు హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో లింగరాజు చేతుల మీదుగా పాఠశాల యాజమాన్యానికి అప్పగించారు. పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు అధ్యక్షతన లింగరాజు, హెచ్ఎం ఎంపిక చేసిన బాలికలకు సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్‌తో పాటు పాఠశాలకు చెందిన పలువురు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది హాజరయ్యారు.

రహదారి ప్రమాదాలపై అవగాహన

భీమడోలు : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రమాదాల నుంచి రక్షణ పొందాలని భీమడోలు ఎస్ఐ చావా సురేష్ కోరారు. జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం ఎస్ఐ మోటార్ వాహనాలను తనిఖీ చేస్తుండగా పలువురు ద్విచక్ర మోటార్ వాహనదారులు హెల్మెట్లు లేకుండా ప్రయాణం చేయటం గమనించారు. వారందరిని ఒక చోట సమావేశపరిచి హెల్మెట్ ధారణ అవసరం, మోటార్ వాహన చట్టం నిబంధనల గురించి అవగాహన కల్పించారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

మండవల్లి : విద్యార్థులు తమ అభిరుచిని గుర్తించడమే విద్యలో విజయం సాధించేందుకు పునాది అని ప్రొఫెసర్ సుధాతత్ల విజయకుమార్ పేర్కొన్నారు. మండలంలోని చింతపండు జిల్లా పరిషత్ హైస్కూల్లో మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కొండేటి సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన కెరియర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు మంచి వ్యక్తిత్వం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సంస్థ కోశాధికారి గుర్రం శ్యాంకుమార్, చింతపల్లి వెంకటనారాయణ, సభ్యులు ముంగర సీత, ఎండి గాలి బాబు, గాయత్రి, ఉపాధ్యాయులు రామాంజనేయులు పాల్గొన్నారు.

మండవల్లి గ్రామసభ వాయిదా

మండవల్లి : గ్రామ సర్పంచి అందుబాటులో లేరని గ్రామసభను నిరవధికంగా కార్యదర్శి తోట శ్రీనివాసరావు వాయిదా వేయడం గ్రామసభ నియమ నిబంధనలకు వ్యతిరేకమని ప్రజా పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక సెంటర్‌లో మాట్లాడుతూ గ్రామసభను ఈనెల 6వ తేదీ నిర్వహించాలని ఎంపిడిఓ వెంకటరమణ గ్రామసభ షెడ్యూల్ ప్రకటించడం జరిగిందని, అయితే సర్పంచి అందుబాటులో ఉండడం లేదనే సాకుతో వాయిదా వేస్తూ ప్రకటించడం దారుణం అన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ముదినేపల్లి : చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపిపి వీరమల్లు నరసింహారావు అన్నారు. మండలంలోని వడాలి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

జీలుగుమిల్లి : మండలంలోని తాటియాకులగూడెం గ్రామంలోని జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం హెడ్ కానిస్టేబుల్ కె.నాగేశ్వరావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేస్తుండగా వీరాస్వామి అనే వ్యక్తి తెలంగాణ నుంచి తన బ్యాగ్‌లో 07 బాటిళ్ల మద్యాన్ని పెట్టుకొని అక్రమంగా వస్తుండగా పట్టుకోవడం జరిగిందని తెలిపారు. పట్టుకున్న మద్యాన్ని సీజ్ చేసి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఆలయంలో చోరీ : రూ.2 లక్షలు అపహరణ

ఏలూరు స్పోర్ట్స్ : నగరంలోని సత్రంపాడు ప్రాంతంలోని శ్రీలక్ష్మీ గణపతి దేవాలయంలో గురువారం రాత్రి హుండీలు పగలగొట్టి దుండగులు చోరీకి పాల్పడ్డారు. దాదాపు రూ.2 లక్షలు మాయమైనట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. వెంటనే ఆలయ పెద్దలు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న క్లూస్ టీం వేలిముద్రలు సేకరించి పరిశీలిస్తున్నారు.

మహిళకు రెండు సంవత్సరాలు జైలు

ఏలూరు స్పోర్ట్స్ : ఏడు దొంగతనం కేసులలో నిందితురాలుగా ఉన్న మహిళకు జిల్లా న్యాయమూర్తి రెండు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పునిచ్చారు. ఏలూరుకు చెందిన పెందుర్తి జ్యోతి భర్తతో కలిసి జీవనం సాగిస్తూ రాత్రి వేళ ఒంటరిగా రెక్కి నిర్వహించి దొంగతనాలకు పాల్పడుతూ ఉండేది. ఆయితే రెండో పట్టణ పరిధిలో ఈమెపై మొత్తం ఏడు కేసులు నమోదయ్యాయి. ఈ కేసులను జిల్లా రెండవ అదనపు న్యాయమూర్తి వాసవీదేవి విచారించి నేరం రుజువు కావడంతో, సాక్ష్యాధారాలతో ఆమెకు రెండు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధిస్తూ, ప్రతి ఒక్క కేసుకు రూ.10 వేల జరిమానా విధించారు.